క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



జలబంధిరాజుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోఆర్డినేటర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బర్రె జలబంధిరాజు అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సమైక్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, పార్టీ నాయకులు లంకే చిరంజీవి, రేవు రాజేష్, ముత్తాబత్తుల సురేష్ , ముదే దుర్గ బాబు, అంబటి శ్రీను, దారా చిన్నబాబు, పాము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కళా వెంకట్రావు సొసైటీ అధ్యక్షుడిగా శరత్‌బాబు

అమలాపురం టౌన్: అమలాపురం కళా వెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అల్లాడ శరత్‌బాబు ఎన్నికయ్యారు. స్థానిక మెబర్లీపేటలో శరత్‌బాబును వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం రాత్రి కలిసి సత్కరించి అభినందించారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, వాకర్స్ చీఫ్ కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధులు బూరగాయల శివరామకృష్ణ, తాళాబత్తుల చినబాబు, పచ్చిగోళ్ల రాజా, తదితరులు శరత్‌బాబును కలిసి అభినందించి సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

యానాం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహించే హెచ్ఆర్ స్క్వేర్ పారిశుధ్య కార్మికులకు శుక్రవారం అంబేడ్కర్ నగర్‌కు చెందిన దివంగత ఉంద్రు ప్రసాదరావు జ్ఞాపకార్థం కుమారులు రవి, సంజీవ్ సేఫ్టీకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 40 జతల బూట్లు, చేతి గ్లౌజ్‌లు, సేఫ్టీ జాకెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల భద్రతకు అందరూ ప్రాధాన్యతనిస్తూ వారికి సేఫ్టీకిట్లను పంపిణీ చేశామన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారునికి అభినందన

ఉప్పలగుప్తం: ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యనమదల ఇందిర ప్రతిభ చూపారు. 69 కిలోల విభాగంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందిర రెండవ స్థానంలో నిలిచి, వెండి పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో హెచ్ఎం జి.కనకదుర్గ, పీడీలు గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి, పీఈటీ విజయభాస్కర్ ఆమె తల్లిదండ్రుల సమక్షంలో ఇందిరను అభినందించారు. మరెన్నో విజయాలతో పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని హెచ్ఎం కనకదుర్గ కోరారు.

సముద్రపు నాచు తయారీపై శిక్షణ

ఉప్పలగుప్తం: సముద్రతీరంలో నివసించే మహిళలు సముద్రం నుంచి వచ్చే నాచుతో వ్యాపారం చేస్తూ ఆర్థిక స్థిరత్వం పొందాలని ఈసీఆర్ఐసీసీ జిల్లా సమన్వయ కర్త ఎల్.హర్ష కుమార్, డ్వాక్రా మహిళలకు సూచించారు. మండలంలోని ఎస్.యానాంలో సముద్రతీర ప్రాంతంలో మత్స్యశాఖ, అటవీశాఖ, డీఆర్‌డీఏ శాఖల ఆధ్వర్యంలో 40మంది డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ విధానంలో సముద్రపు నాచు (సీ వీడ్) తయారీపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

కల్యాణ దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో కొలువైన కల్యాణ దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాస శోభ సంతరించుకుంది. అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఆషాఢం సారెను సమర్పించారు. తొలుత కాలనీని మహిళలు మంగళ వాయిద్యాలతో సారెను ఊరేగించారు. వివిధ స్వీట్లు, పానకం, బెల్లం, చలిమిడి పానకంతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని కాలనీ వాసులు దర్శించుకుని పూజలు చేశారు.

స్విమ్మింగ్‌పూల్ దుస్థితిపై వినతిపత్రం

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న స్విమ్మింగ్‌పూల్ నిర్వహణను కొన్ని నెలలుగా సిబ్బంది పట్టించుకోవడం లేదు. స్విమ్మింగ్‌పూల్‌లోని నీరు పచ్చగామారి, కప్పలు, కీటకాలు చేరి దుర్గంధం వ్యాపిస్తోందని, తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థాని దినేష్ ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెల్లం చిన్న, బలగం గణేష్, చెక్కల అరుణ్‌కుమార్, వైదాడి శ్రీనివాస్, సింహాద్రి, విజయ్ వర్మ పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ దందా

- అడ్డూ అదుపూ లేకుండా విక్రయాలు
- నిబంధనలకు పాతర
- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ వ్యాపారం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్‌లో విక్రయానికి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక



లచ్చిపాలెంలో ఎన్‌హెచ్ స్థలాన్ని ఆక్రమించి పూడ్చివేసేందుకు వేసిన మట్టి



జి.వేమవరంలో ప్రైవేటు స్థలంలో వేసిన మట్టి



మట్టి ట్రాక్టర్లు తిరగడంతో ధ్వంసమైన గ్రావెల్ రహదారి

తాళ్లరేవు: కూటమి ప్రభుత్వ పాలనలో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికార పార్టీ నేతల అండదండలతో మండలంలో అక్రమార్కులు నిబంధనలకు పాతర వేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా భూముల్లో పెద్ద ఎత్తున మట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతటితో ఆగకుండా పలు పంచాయతీల్లో మట్టిని నిల్వచేసి అక్రమ వ్యాపారం ఏడాది అంతా సాగించుకునే విధంగా మట్టిని భారీస్థాయిలో నిల్వ చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఈ విధంగా నిల్వ చేసిన మట్టి కొండలను తలిపిస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో పి.మల్లవరం, పోలేకుర్రు, గాడిమొగ, పటవల తదితర పంచాయతీల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో దర్జాగా మట్టిని పట్టపగలే తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక అక్రమంగా నిల్వ

తమ ప్రభుత్వ పాలనలో ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని పాలకులు చెబుతుండగా, వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో ఇసుకను అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి. పలువురు అక్రమార్కులు ఇసుకను దర్జాగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. స్వయంగా బోర్డులు పెట్టి మరీ ఇసుకను విక్రయించడం విశేషం. వినియోగదారులకు గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలకు లభ్యం కాగా నేడు అక్రమార్కులు రూ. 4 వేల నుంచి ఆరు వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా గోదావరికి వరద నీరు పోటెత్తుతుండడంతో అక్రమార్కులు ఇసుకను అక్రమంగా నిల్వచేసి అందినకాడికి దోచుకుంటున్నారు. వేరేదారి లేకపోవడంతో వినియోగదారులు అధిక ధరలకు ఇసుక, మట్టిని కొనుగోలు చేస్తూ చేతి చమురును వదిలించుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు

ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టిని తరలించి స్థలాలను పూడుస్తున్నారు. కనీసం స్థలాన్ని పూడ్చేందుకు, మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని జి.వేమవరం చినజీయర్ స్వామి ఆశ్రమం వెనుకగల స్థలాన్ని కొందరు అక్రమార్కులు కొన్నిరోజులుగా మట్టితో పూడ్చివేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి ట్రాక్టర్లు ఇష్టానుసారం నడపడంతో నిక్షేపంలా ఉన్న రహదారి ఛిద్రమైందని స్థానికులు వాపోతున్నారు. తాము వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విలువైన ప్రభుత్వ భూముల కబ్జా

జాతీయ రహదారి 216ను ఆనుకుని ఉన్న పలు విలువైన స్థలాలను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ప్రధానంగా సుంకరపాలెం, లచ్చిపాలెం గ్రామాలను ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ భూములను అక్రమార్కులు ఆక్రమించుకుని పూడ్చివేసి ఆనక అద్దెలకు ఇచ్చుకోవడం లేదా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. లచ్చిపాలెం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని కొద్దిరోజులుగా మట్టిని పూడుస్తున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ స్థలాన్ని కూడా పూడ్చివేసి కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు, నిబంధనలకు విరుద్ధంగా మట్టిని పూడుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల స్థానిక బైపాస్ రహదారిలో సుంకరపాలెం వద్ద ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా గ్రావెల్‌తో పూడ్చివేసినా పట్టించుకున్న నాథుడే కనిపించలేదని పలువురు వాపోతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మట్టి, ఇసుక అక్రమ దందాలపై దృష్టిసారించి ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పలగుప్తం మండలం పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఓగూరి విజయ్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జొన్నాడ శ్రీదుర్గ, రైతు విభాగం అధ్యక్షుడిగా చిక్కం బాలసుబ్రహ్మణ్యం, బీసీ సెల్ అధ్యక్షుడిగా యనమదల పల్లంరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పోతుమూడి కొండబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ అహ్మద్ అలీషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బీర బాలరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా తెలాటి రామ్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా కుంచే చిట్టి కుమార్, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా పోలిశెట్టి వీర్రాజు, వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా ఎస్. చిరంజీవి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పోలిశెట్టి నర్సబాబు, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా బళ్ల నాగసతీష్, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా వీరవిల్లి వీరయ్య, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా జి.గోవిందరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా చేట్ల విద్యాసాగర్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా బడుగు శ్రీనివాసరావు నియమితులయ్యారు.

పోలేరమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: ఆషాఢమాసం సందర్భంగా పోలేకుర్రు గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు అమ్మవారికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పోతుల చినబాబు, పుప్పాల శ్రవణ్‌కుమార్, పోతుల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పంచాంగ కర్త నాగాదిత్యకు సత్కారం



పంచాంగ కర్త నాగాదిత్య దంపతులను సత్కరిస్తున్న సంస్కార భారతి జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన పంచాంగ కర్త, పురోహిత బ్రహ్మ ఉపద్రష్ట నాగాదిత్య, అష్టావధాని ఆకొండి బాలభానుకు సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏవీఆర్ నగర్‌లోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా పంచాంగ కర్తగా, పురోహిత బ్రహ్మ, వాస్తు పండితుడిగా నాగాదిత్య చేస్తున్న సేవలకు ఆయనను సత్కరించి గౌరవిస్తున్నట్లు సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి తెలిపారు. అనంతరం పంచాంగ కర్త నాగాదిత్య దంపతులను, అష్టావధాని బాలభాను దంపతులను సంస్కార భారతి జిల్లా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సంస్కార భారతి రాష్ట్ర నాయకురాలు వేదనభట్ల సాయిలక్ష్మి, జిల్లా ప్రతినిధులు ఆకొండి పవన్, ఆర్‌వీ నాయుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతా మహాలక్ష్మి, వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయివర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వైఎస్సాస్ మూర్తి, బుర్ర కథ కళాకారుడు బీఆర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొని నాగాదిత్య పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ వారోత్సవాలు ప్రారంభం



మధ్యవర్తిత్వం వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్

అమలాపురం టౌన్: మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాల కోసం ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకూ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ తెలిపారు. స్థానిక కోర్టుల సముదాయంలో ఈ వారోత్సవాలను ఆయన శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం అవగాహన కార్యక్రమాలు, వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జుడీషియల్ ఆఫీసర్లు, అడ్వకేట్లు, బ్యాంక్, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్, చిట్ ఫండ్, బీమా కంపెనీలు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో మధ్యవర్తిత్వంపై జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ న్యాయ సేవా సదన్‌లో స్థాపించిన మధ్యవర్తిత్వం కేంద్రం ద్వారా ప్రజలు తమ వివాదాలను శాంతియుతంగా, తక్కువ ఖర్చుతో, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి గోవర్ధన్ సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కార మార్గం, అవార్డు జారీ చేయడంలో న్యాయవాదులు మంచి ఫలితాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. రాజీ అంటే ఇద్దరి గెలుపు అనే విషయాన్ని అందరూ గుర్తించాలని న్యాయమూర్తి గోవర్ధన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిషనల్ సివిల్ జడ్జి శ్రీలేఖ, స్పెషల్ మెజిస్ట్రేట్ పీవీ ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్, కోశాధికారి నందెపు శ్రీవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా అండర్-15 చెస్ పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు 8 మంది ఎంపిక




రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ -15 చెస్ పోటీలు శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు 60 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. బాలుర విభాగం నుంచి నలుగురిని, బాలికల విభాగం నుంచి నలుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సంఘం కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. బాలుర విభాగంలో బండారు నానిబాబి (ప్రథమ), తాడి సాయి వెంకటేష్ (ద్వితీయ), సాధనాల శ్రీసంతోష్ (తృతీయ), పనిశెట్టి సాయి అవినాష్ (నాలుగో స్థానం), బాలికల విభాగంలో పనిశెట్టి ధరణి (ప్రథమ), బొడ్డు సాన్వి (ద్వితీయ), గుత్తుల వైష్ణవి (తృతీయ), పితాని సాయి లిఖిత (నాలుగో స్థానం) కైవసం చేసుకున్నారని సురేష్ తెలిపారు. వీరు త్వరలో విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారాయుడు ధృవీకరణ పత్రాలు, షీల్డులు బహుమతులు అందజేశారు.

గాడిమొగలో జనాభా దినోత్సవ ర్యాలీ

తాళ్లరేవు: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాడిమొగ పీహెచ్‌సీ వైద్యాధికారి జయ భార్గవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జనాభా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ బీఎస్ఎల్‌వీ కుమార్, హెచ్‌వీ రాణి, హెల్త్ సూపర్‌వైజర్ రంజన్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, ఆశాలు విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.2.75 కోట్లు మంజూరు



మల్లాడి కృష్ణారావు

యానాం: శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయం నిర్మాణానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి ఆదేశాలతో రూ.2.75 కోట్లు ఆర్థికశాఖ ఆమోదంతో మంజూరయ్యాయని శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. యానాంలో ఆలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే స్పందించి తక్షణం చెక్కును అందజేసిన సీఎం రంగసామి, సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శులకు యానాం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మొత్తాన్ని వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఖాతాలో వేసి భక్తుల విరాళాలతో జతచేసి టీటీడీకి అందజేస్తామని ఆయన తెలిపారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి అరాచక పాలనను, చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. భట్నవెల్లిలో అమలాపురం వైఎస్సార్ సీపీ పార్లమెంటు ఇన్‌చార్జి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం వద్ద శ్రీకాంత్ అధ్యక్షతన శుక్రవారం ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ స్థానిక వాసర్ల వెంకన్న కల్యాణ మండపంలో 13వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు అమలాపురం వాసర్ల వెంకన్న కల్యాణ మండపంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై గ్రామ కమిటీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేసి గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దంగేటి రాంబాబు, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల అధ్యక్షులు బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, జిల్లి శ్రీను, పెనుమాల విక్రమ్, కూడుపూడి సూర్యప్రకాష్, ముత్తాబత్తుల సంతోష్, కర్రి శ్రీను, లంకే శ్రీను, దంగే దొరబాబు, పోగాకు శ్రీను పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

అమలాపురం టౌన్: అమలాపురం నియోజవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ స్థానిక వాసర్ల గార్డెన్‌లో ఈనెల 13న నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' సభ ఏర్పాట్లను నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. సభకు పార్టీ జిల్లా ముఖ్య నేతలు వస్తున్న క్రమంలో అందుకు తగిన ఏర్పాట్ల కోసం డాక్టర్ శ్రీకాంత్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కుడుపూడి బాబు, సూదా గణపతి, సరెళ్ల రామకృష్ణ, చొల్లంగి సుబ్బిరామ్, దూడల ఫణి, కేతా భానుతేజ, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ సభా వేదికను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు

ప్రజలకు రక్షిత తాగునీటిని అందించాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్
- పైప్‌లైన్ల లీకేజీ, కలుషిత నీటి సరఫరాపై సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పైప్‌లైన్ల లీకేజీలు, కలుషిత నీటి సరఫరాపై అప్రమత్తంగా వ్యవహరిస్తూ అన్ని విధాల ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సమృద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ రకాలుగా పైప్ లైన్లు లీకేజీ కారణంగా కలుషిత తాగునీరు సరఫరా చేయకుండా మెలకువలు, కీటక జనిత వ్యాధులు నియంత్రణ చర్యలు, సంక్షేమ వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం అంశాల పురోగతిపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఇంజినీర్లు ఈ సీజన్‌లో అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి సంక్షేమ గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూసేకరణలో సమస్యలుంటే సంబంధిత తహసీల్దార్లకు, వసతి గృహ సంక్షేమ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు రాంప్రసాద్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల నిర్వహణను మెరుగుపరచాలి


అమలాపురం సాంఘిక వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీరును అన్ని విధాలుగా మెరుగుపరచాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సంక్షేమ వసతి గృహాధికారులతో సమావేశం నిర్వహించి ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు గురుకులాలలో మరమ్మతులను, వసతులు కల్పన అంశంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి. జ్యోతిలక్ష్మీ దేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, విద్య సంక్షేమ ఇంజనీరింగ్ విభాగ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



అమలాపురం రూరల్: ఆషాఢ మాసంలో క్షామ విముక్తి కోసం అమ్మవార్లను కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించి భక్తులు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ ఆచారంలో భాగంగా శ్రీనివాస బాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామిని శుక్రవారం కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం నాగసత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు, చింతపట్ల సీతారత్నం, బట్టు లక్ష్మి, బాసిన సుజాత, బట్టా శ్రీదేవి, అన్నపూర్ణ, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు, ఫ్లెక్సీల తొలగింపు



అమలాపురంలో ఫ్లెక్సీల తొలగింపును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ రోడ్డు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ రోడ్డు చెంత ఉన్న ఆక్రమణలు, అనధికార ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్య నినాదాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచేందుకు ఈ కార్యక్రమం అమలుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కమిషనర్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. తొలుత కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్లు, పారిశుధ్య సిబ్బంది సఫాయి అప్నా బీమారి బాగో నినాదాలతో ఉన్న ఫ్లెక్సీని పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. తర్వాత రోడ్డు చెంత ఉన్న ఆక్రమణలు, అనధికార ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది వరస పెట్టి తొలగించారు. కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆక్రమణలు, ఫ్లెక్సీల తొలగింపును దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం తర్వాత పారిశుధ్య కార్మికులతో బస్‌స్టేషన్ నుంచి గడియారం స్తంభం వరకూ గల మెయిన్ రోడ్డును పూర్తిగా శుభ్రం చేయించారు. మున్సిపాలిటీ అనుమతులు లేకుండా ఏదైనా కట్టడాలు నిర్మించినా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా వాటిని తక్షణమే తొలగించడమే కాకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ హెచ్చరించారు. మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈ పి.వెంకటేష్ తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసిన అధికారులు

యానాం: దివ్యాంగులకు కేంద్ర విద్యుత్ శాఖ పరిధిలోని మహారత్న ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్ఈసీ లిమిటెడ్, ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింమ్‌కో), కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖలు సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన ఉపకరణాలను శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ నిర్వహణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ట్రైనీ ఐఏఎస్, మున్సిపల్ కమిషనర్ అఖిల్ తదితరులు ఉపకరణాలను దివ్యాంగులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఉపకరణాలను వినియోగించుకునేలా వారి తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ఆలింమ్‌కో ప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.